న్యూస్‌రీల్

21న శరభన్నపాలెంలో మెగా రక్తదాన శిబిరం

కొయ్యూరు: లోకుల గాంధీ ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఈ నెల 21న శరభన్నపాలెంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు నిర్వహిస్తున్నటు తోడు ట్రస్టు ప్రతినిధి మురళీకృష్ణ గురువారం తెలిపారు. యువకులు ముందుకు వచ్చి రక్తదానం చేయాలని ఆయన కోరారు. దీంతో పాటు సికిల్‌సెల్ ఎనీమియా పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ సందర్భంగా పేదలకు దుస్తులు పంపిణీ చేస్తామని ఆయన పేర్కొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

సాక్షి, పాడేరు: అరకు నియోజకవర్గ పరిధిలోని అనంతగిరి, డుంబ్రిగుడ, అరకులోయ, ముంచంగిపుట్టు, పెదబయలు మండలాల్లో ఖాళీగా ఉన్న 18 అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు.అర్హత గల మహిళా అభ్యర్థులు ఈనెల 18వతేదీ నుంచి 25వతేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా దరఖాస్తులను సంబంధిత ఐసీడీఎస్ సీడీపీవో కార్యాలయాల్లో నేరుగా లేదా పోస్టల్ ద్వారా అందజేయాలని ఆయన సూచించారు. పోస్టుల వివరాలు, అభ్యర్థుల విద్య, ఇతర అర్హతలు, సమగ్ర సమాచారం సంబంధిత సీడీపీవో కార్యాలయాల్లో సంప్రదించాలని ఆయన సూచించారు.

కలెక్టర్ దృష్టికి ఉపాధ్యాయుల సమస్యలు



కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న టీడబ్ల్యూ ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు

సాక్షి,పాడేరు: గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘ ఉమ్మడి విశాఖ జిల్లా నూతన కార్యవర్గ ప్రతినిధులు గురువారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిశారు. గిరిజన సంక్షేమశాఖలో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది ఎదుర్కొంటున్న పలు సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయనను కలిసిన వారిలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కంబిడి నీలకంఠం, శోభన్‌బాబు, రాష్ట్ర అధ్యక్షుడు రేగం సూర్యనారాయణ, ఇతర రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు కుర్తాడి రామారావు, రీమ లిజాన్, జీవీవీ ప్రసాద్, బావరాజు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కింగ్ కోబ్రా కలకలం

- స్థానికుల చేతిలో హతం



పందిరిమామిడిలో హతమైన కింగ్ కోబ్రా

రంపచోడవరం: ఇక్కడికి సమీపంలోని పందిరిమామిడిలో బుధవారం అర్ధరాత్రి కింగ్ కోబ్రా కలకలం సృష్టించింది. ఆహార అన్వేషణలో భాగంగా పందిరిమామిడి వద్ద ఒక ఇంటి ఆవరణలో ఉన్న జెర్రిగొడ్డును మింగుతున్న కింగ్‌కోబ్రాను చూసి హడలిపోయారు. వెంటనే స్థానికులు దానిని హతమార్చారు. కింగ్ కోబ్రా సుమారు 20 అడుగులు ఉందని స్థానికులు తెలిపారు.

అనారోగ్యంతో ఆశ్రమ విద్యార్థిని మృతి



చాందిని (ఫైల్)

జి.మాడుగుల: అనారోగ్యానికి గురైన మండలంలోని కె.కోడాపల్లి పంచాయతీ బందవీధి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాల విద్యార్థిని కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది. చింతపల్లి మండలం తాజంగి గ్రామానికి చెందిన వనుగు చాందిని మండలంలోని బంధవీధి ఆశ్రమోన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. గత నెల పదవ తేదీన ఆమెను తల్లి ఉపాధ్యాయుల అనుమతితో స్వగ్రామమైన తాజంగి తీసుకువెళ్లింది. కొద్దిరోజులకు ఆమె అనారోగ్యానికి గురైంది. గ్రామంలో వైద్యం అందించిన తగ్గకపోవడంతో మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. మరింత మెరుగైన వైద్యం నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

గిరిలో 'చిరు'సిరులు

- సత్ఫలితాలిస్తున్న 'అటవీ హక్కు' భూ పంపిణీ
- 1,39,606 మందికి 2,73,510 ఎకరాలు
- చిరు ధాన్యాలు, వాణిజ్య పంటల సాగుతో మంచి ఆదాయం
- ఆర్థికంగా నిలదొక్కుకుంటున్న గిరి రైతు

అటవీహక్కు చట్టం కింద ప్రభుత్వం పంపిణీ చేసిన భూముల్లో చిరు ధాన్యాల సాగు చేపట్టి గిరి రైతులు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 1,39,606 మందికి ప్రభుత్వం 2,73,510 ఎకరాలు పంపిణీ చేసింది. ప్రభుత్వం అందించే సహకారాన్ని సద్వినియోగం చేసుకుంటూ 70 వేల ఎకరాల్లో చిరుధాన్యాలు వాణిజ్య పంటల సాగు చేపట్టి మంచి ఆదాయం పొందుతున్నారు.



పాడేరు మండలం దల్లాపల్లి మార్గంలోని అటవీ భూమిలో రాగులు పైరు

సాక్షి,పాడేరు: ఒకప్పుడు ఏ ఆధారం లేక మనుగడే కష్టంగా ఉన్న గిరిజనుల కుటుంబాల్లో అటవీహక్కు చట్టం కింద ప్రభుత్వం పంపిణీ చేసిన భూములు వెలుగులు నింపుతున్నాయి. ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు దోహదపడుతున్నాయి. దివంగత సీఎం వైఎస్ చేపట్టిన ఈ కార్యక్రమం నేటికీ దిగ్విజయంగా కొనసాగుతోంది. ఆయన హయాంలో 2009లో పాడేరు డివిజన్‌లో లక్ష ఎకరాల అటవీ భూములకు పట్టాలు పంపిణీ చేశారు. అప్పటినుంచి నేటి వరకు అటవీభూములకు హక్కు పత్రాలు పొందిన రైతులంతా చిరుధాన్యాలు,వాణిజ్య పంటలను సాగు చేస్తూ ఆదాయం పొందుతున్నారు.

తండ్రి ఆశయసాధనలో..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత వైఎస్ బాటలోనే ఆయన తనయుడు సీఎం జగన్‌మోహన్ రెడ్డి అటవీహక్కు చట్టంపై దృష్టి సారించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పట్టాలకోసం దరఖాస్తు చేసుకున్న వారందరికి హక్కు పట్టాలు మంజూరు చేశారు. పాడేరు, రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలో సుమారు 1.30 లక్షల మందికి పంపిణీ చేశారు. జిల్లా వ్యాప్తంగా 1,39,606 మంది గిరిజన రైతులు 2009 నుంచి ఇంతవరకు 2,73,510 ఎకరాలకు హక్కు పత్రాలు పొందారు.

పూర్తిస్థాయిలో సహకారం

సాగుకు అవసరమైన సహకారాన్ని వ్యవసాయశాఖ అందిస్తోంది. ఈ భూముల్లో సుమారు 70 వేల ఎకరాల్లో రాగులు, కొర్రలు, సామలు, రాజ్‌మాతోపాటు వాణిజ్య పంటలైన అల్లం, పసుపు, పిప్పళ్లు తదితర వాణిజ్య పంటలను సాగు చేస్తున్నారు. హక్కు పట్టాలు పొందిన రైతులందరికీ రైతుభరోసా సాయం అందిస్తోంది. 90శాతం రాయితీపై రాగులు, కొర్రలు, రాజ్‌మా విత్తనాలను అందజేసింది. చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచే లక్ష్యంతో పూర్తిశాతం రాయితీపై 305 క్వింటాళ్ల రాగులు, 200 క్వింటాళ్ల కొర్రలు విత్తనాలను వ్యవసాయశాఖ సరఫరా చేసింది. ఇవి కాకుండా 90 శాతం రాయితీపై 4,553 క్వింటాళ్ల రాజ్‌మా విత్తనాలను అందజేసింది. వీటితో సాగు చేపట్టిన పంటలకు పోడు భూములు కళకళలాడుతున్నాయి.

జీవనాధారం ఏర్పడింది



ఎకరాన్నర కొండపోడుకు ప్రభుత్వం రెండేళ్ల క్రితం హక్కు పట్టా మంజూరు చేసింది. ఈ భూమిలో రాగులు, కొర్రలు, సామల సాగు చేపట్టా. మంచి దిగుబడి వచ్చింది. తిండి అవసరాలకు కొంత ఉంచుకుని మిగతా పంటను మార్కెట్‌కు తరలించి విక్రయిస్తున్నా. అటవీహక్కు చట్టం కింద పట్టా ఇవ్వడం వల్ల జీవనాధారం ఏర్పడింది.

– పూజారి సోమేష్, గిరి రైతు, రామచంద్రపురం, పాడేరు మండలం

గ్రూప్-1లో మెరిసిన ఏటీడబ్ల్యూవో

• మెడికల్ అండ్ హెల్త్ సెక్రటరీగా హాసిని



హాసిని

అడ్డతీగల: గ్రూప్-1 ఫలితాల్లో అడ్డతీగల ఏటీడబ్ల్యూవో మామిళ్లపల్లి హాసిని మెరిశారు. మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో సెక్రటరీగా ఉద్యోగం సాధించారు. ప్రకాశం జిల్లా కొండెపి ప్రాంతానికి చెందిన ఆమె ఐదేళ్లుగా రంపచోడవరం ఐటీడీఏ పరిధిలోని అడ్డతీగల ఏటీడబ్ల్యూవోగా పనిచేస్తున్నారు. ఒకవైపు విధులు నిర్వహిస్తూనే గ్రూప్-1 పరీక్షలకు సన్నద్ధం అయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన 111 పోస్టుల్లో ఆమె మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో సెక్రటరీ ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఆమె తండ్రి మామిళ్లపల్లి వెంకటేశ్వర్లు కొండెపి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. ఏటీడబ్ల్యూవోగా విధులు నిర్వహిస్తూ గ్రూప్-1 అధికారిగా ఎంపికైన ఆమెకు ఐటీడీఏ అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు.

• డీఎస్పీగా జీవన



చిట్టపులి జీవన

సాక్షి,పాడేరు: పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో వేపగుంట యూత్ శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందిన గిరిజన విద్యార్థిని చిట్టపులి జీవన గ్రూప్-1లో డీఎస్పీగా ఎంపికైంది. జిల్లాలోని ముంచంగిపుట్టు మండలం కిలగాడకు చెందిన చిట్టపులి జీవన మొదటి ప్రిలిమ్స్‌కు ప్రైవేటుగా శిక్షణ పొందారు. గతేడాది ఐటీడీఏ వేపగుంట యూత్ శిక్షణ కేంద్రంలో నిర్వహించిన సివిల్స్ శిక్షణకు ఆమె ఎంపికయ్యారు. ఇక్కడ సివిల్స్ శిక్షణ పొందుతూనే గ్రూప్-1 మెయిన్స్ రాసి సత్తా చాటారు. గురువారం విడుదలైన గ్రూప్-1 ఫలితాల్లో జీవన డీఎస్పీగా ఎంపికయ్యారు. జీవన తండ్రి రాజుపడాల్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. వీరు పెదబయలులో నివాసం ఉంటున్నారు. తమ కుమార్తె డీఎస్పీగా ఎంపికవ్వడంపై తల్లిదండ్రులు రాజుపడాల్,రమ్య ఆనందం వ్యక్తం చేశారు.

49 పరిశ్రమలకు ఆమోదం

- జగనన్న బడుగు వికాసంలో నిర్ణయం
- కలెక్టర్ సుమిత్‌కుమార్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: జగనన్న బడుగు వికాసంలో జిల్లాలోని 49 పరిశ్రమలకు ఆమోదం లభించిందని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. జిల్లా పారిశ్రామిక ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ తొలి సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. కమిటీలో ఉన్న అధికారులు, ఇతర ప్రతినిధులతో ఆయన సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్వీస్ సెక్టార్‌లో 49 పరిశ్రమలను ఎంపిక చేశామన్నారు. ఈ పథకం కింద లబ్ధిదారులకు 45 శాతం రాయితీ ఉంటుందన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి మారేడుమిల్లిలోని నేచురల్ రబ్బర్ ప్రొడక్ట్స్ క్లస్టర్‌లో 81 పరిశ్రమల కొనసాగింపునకు కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. కాఫీ క్లస్టర్‌కు సంబంధించి ది విశాఖపట్నం చింతపల్లి ట్రైబల్ కాఫీ ప్రొడ్యూసర్స్ మాక్స్ పరిశ్రమపై కమిటీ సమగ్ర నివేదిక కోరిందన్నారు. జిల్లాలో మధ్య, చిన్న, సూక్ష్మ పరిశ్రమల ఏర్పాటుపై గిరిజనుల్లో అవగాహన కల్పించాలని, పారిశ్రామిక రంగం వైపు ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ శ్రీవాణిధర్ రామన్, సహాయ సంచాలకులు నవీన్‌కుమార్, పారిశ్రామిక అభివృద్ధి అధికారి సూర్యప్రకాష్, సభ్యులు, పలు శాఖల అధికారులు జయబాబు, నందు, మురళి, రవితేజ, సీతారామరాజు, ఐ.కొండలరావు, సీతారామరాజు, వాసు, సుజాత తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో స్పందించండి : కోర్టు కేసులకు సంబంధించి అధికారులు సకాలంలో స్పందించి అఫిడవిట్‌లు దాఖలు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పలు అంశాలపై కలెక్టరేట్ నుంచి జిల్లాలోని అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికి ఓటర్ల సర్వేను పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. ఓటర్ల జాబితలో సవరణలు, మార్పులు, చేర్పులు, పీవీటీజీల కొత్త ఓటర్ల నమోదును విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఒకే ఇంటిలో 10 మందికి పైగా ఓటర్లు ఉంటే, ఇంటినెంబర్‌లు లేకున్నా అలాంటి ఓట్లపై బూత్‌లెవెల్ అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారించాలని సూచించారు. స్పందన, జగనన్నకు చెబుదాం వినతులను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.జేసీ శివశ్రీనివాస్ పాల్గొన్నారు.

సాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

ఇరిగేషన్ ఈఈ సుబ్బయ్య

సాక్షి ఎఫెక్ట్..

రాజవొమ్మంగి: మండలంలో వట్టిగెడ్డ జలాశయం, జడ్డంగిలో మడేరు ఆనకట్ట రైతులకు సాగు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని మైనర్ ఇరిగేషన్ ఈఈ కె.సుబ్బయ్య తెలిపారు. ఆయకట్టుదారుల సమస్యలపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనాలకు ఆయన స్పందించారు. దీనిలో భాగంగా గురువారం వట్టిగెడ్డ జలాశయం, మడేరు ఆనకట్టను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వట్టిగెడ్డ రిజర్వాయర్ పంట కాలువలో పూడిక తీతకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇదే కాలువ ప్రారంభంలో కూలిన చోట కాంక్రీట్ వాల్ నిర్మిస్తామని ఆయన పేర్కొన్నారు. మడేరు ఆనకట్ట ప్రధాన కాలువలో పూడికతీతతోపాటు కాలువ గట్ల మెరుగుకు కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇదే సమయంలో అక్కడికి వచ్చిన రైతులు సాగునీటికి ఎదురవుతున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. రూ. 56.46లక్షలతో అంచనాలు రూపొందించామని త్వరలో పనులు చేపడతామని ఈఈ తెలిపారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు.



వట్టిగెడ్డ జలాశయం పంటకాలువను పరిశీలిస్తున్న మైనర్ ఇరిగేషన్ ఈఈ సుబ్బయ్య

రాజవొమ్మంగి శివారు అప్పలరాజుపేట అటవీప్రాంతంలో వట్టిగెడ్డ రిజర్వాయర్‌కు దాదాపు ఏడు కిలోమీటర్ల పొడవు గల పంటకాలువలో పూడిక తీతకు రూ.10.38 లక్షలతో అంచనాలు సిద్ధం చేశామని వివరించారు. మొదటి స్లూయిజ్ వద్ద దెబ్బతిన్న ఎడమ కాలువ గట్టు వెంబడి సుమారు 50 మీటర్ల పొడవున కాంక్రీట్ వాల్ నిర్మాణానికి రూ.23.1 లక్షల అంచనాలతో పనులు చేపడతామని ఆయన పేర్కొన్నారు. మడేరు ఆనకట్ట ఎడవ కాలువ పూడిక తీత పనులకు రూ.9.68 లక్షలు, కాంక్రీట్ పనులకు రూ.13.3 లక్షలతో అంచనాలు సిద్ధం చేశామన్నారు. అధికారులు హరి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దు

- ఎస్ఈబీ సూపరింటెండెంట్ డీవీజీ రాజు



మాట్లాడుతున్న ఎస్ఈబీ సూపరింటెండెంట్ రాజు

అరకులోయ టౌన్: గంజాయి వంటి మత్తు పదార్థాల వల్ల జీవితాలు నాశనం చేసుకోవద్దని ఎస్ఈబీ సూపరింటెండెంట్ డీవీజీ రాజు సూచించారు. గంజాయి వ్యసనం-యువతపై ప్రభావం అనే అంశంపై గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఈబీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. మంచి భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంటెలిజెన్స్ ఇన్‌స్పెక్టర్ తిరుపతి, ఎస్ఈబీ సీఐ, ఎస్ఐలు గణపతిబాబు, జి. దాసు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమానికి పోలీసుశాఖ కృషి



డెంగము గిరిజనులతో మాట్లాడుతున్న ఎస్ఐ రవీంద్ర

- ఎస్ఐ రవీంద్ర
- మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో గిరిజనులతో మమేకం
- గ్రేహౌండ్స్,స్పెషల్ పార్టీ పోలీసులతో సందర్శన

8లో

టూరిజం ఆన్ వీల్స్

విహారయాత్రకు వెళ్లేటప్పుడు హోటల్‌లో రూమ్ కోసం ఎదురు చూడటం.. రెస్టారెంట్‌లో ఫుడ్‌హోమ్లీగా ఉంటుందో లేదో అనే సందేహంతో అడుగు వేయడం.. ప్రైవసీపై ఎన్నో అనుమానాలు.. ప్రతి పర్యాటకుడికీ ఇలాంటి అనుభవాలు ఎదురయ్యే ఉంటాయి. ఇప్పుడా ఆ సమస్య లేకుండా.. నచ్చిన చోటకు వెళ్లి.. మనకు నచ్చినట్లుగా ఉండొచ్చు. అదే కారవాన్ టూరిజం. కొత్తపుంతలు తొక్కుతున్న ఈ టూరిజం వైపు ఏపీ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా 15 ప్రాంతాల్లో దీనిని అమలు చేసేందుకు ప్రయత్నిస్తుండగా.. ఇందులో ఉమ్మడి విశాఖ జిల్లాలో మూడు ప్రాంతాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. మూడు రకాల కారవాన్ టూరిజంను పర్యాటకులకు పరిచయం చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

–సాక్షి, విశాఖపట్నం

- రాష్ట్రవ్యాప్తంగా 15 ప్రాంతాల్లో కారవాన్ టూరిజంకు ప్రణాళికలు
- ఒక్కో ప్రాంతంలో అర ఎకరా విస్తీర్ణంలో పాత్ అభివృద్ధి
- పిక్నిక్ సీజన్‌లో ప్రారంభించేందుకు పర్యాటక శాఖ సన్నాహాలు



కార్వాన్స్



హిల్ స్టేషన్ కారవాన్ రానున్న దల్లాపల్లి ప్రాంతం

ఇప్పటికే ప్రపంచ దేశాల్లో, మన దేశంలో పలు ప్రాంతాల్లోనూ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న కారవాన్ పర్యాటకం ఉమ్మడి విశాఖ జిల్లాలో అందుబాటులోకి తీసుకునేందుకు అధికారులు నివేదిక సిద్ధం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా విశాఖపట్నం, తిరుపతి, విజయవాడ, గండికోట తదితర 15 చోట్ల దీన్ని పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయాలని భావిస్తున్నారు. ఇందులో విశాఖకు సంబంధించి 3 ప్రాంతాలను ఎంపిక చేశారు.

ఉమ్మడి విశాఖలో గుర్తించిన ప్రాంతాలివే..

- అల్లూరి జిల్లాలోని అంజోడా–ఫారెస్ట్ కారవాన్
- దల్లాపల్లి– హిల్‌స్టేషన్ కారవాన్
- ఎర్రమట్టి దిబ్బలు – బీచ్ కారవాన్

మూడు భిన్నమైన కారవాన్‌లు

కారవాన్ టూరిజం సాధ్యాసాధ్యాలపై పర్యాటకశాఖ ఎండీ కన్నబాబు, రీజినల్ డైరెక్టర్ శ్రీనివాస్ పాణి ఇటీవల అరకు, లంబసింగి, పాడేరు, చింతపల్లి తదితర ప్రాంతాల్లో పర్యటించి నివేదికలు సిద్ధం చేశారు. మూడు ప్రాంతాల్లో మూడు భిన్నమైన టూరిజం స్పాట్స్ ఎంపిక చేశారు. పైన్ చెట్లు అధికంగా ఉన్న అనంతగిరికి 35 కి.మీ దూరంలోని అంజోడాలో ఫారెస్ట్ కారవాన్, దల్లాపల్లిలో హిల్‌స్టేషన్ కారవాన్, ఎర్రమట్టి దిబ్బలు ఎదురుగా బీచ్ కారవాన్‌ను పైలట్‌గా ప్రారంభించేందుకు కసరత్తులు జరుగుతున్నాయి. పైన్ చెట్లు పెంచేందుకు రెవెన్యూ విభాగం.. అటవీ శాఖకు 26 ఎకరాలు ఇచ్చింది. ఇందులో రెండు ఎకరాలను తమకు బదలాయించాలని, ఇందులో కారవాన్ టూరిజం ఏర్పాటు చేస్తామని అటవీశాఖకు లేఖ రాశారు. త్వరలోనే దీనికి సంబంధించిన అనుమతులు వచ్చే అవకాశం ఉన్నాయి. మిగిలిన రెండు ప్రాంతాలూ టూరిజం శాఖకు సంబంధించినవే.

కన్సల్టెన్సీ కసరత్తు

కారవాన్ టూరిజంను పైలట్‌గా ప్రారంభించేందుకు ప్రభుత్వం ఎంపిక చేసిన కన్సల్టెన్సీ సంస్థ కసరత్తు చేస్తోంది. ఎంపిక చేసిన ప్రాంతాల్లో డిమాండ్ ఎలా ఉంటుందన్న అంశంపై నివేదిక సిద్ధమవుతోంది. మరోవైపు కారవాన్ టూరిజంలో పెట్టుబడులు పెట్టేందుకు కొన్ని సంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయి. పీపీపీ పద్ధతిలో నిర్వహించేందుకు టూరిజం శాఖతో ఇప్పటికే సంప్రదింపులు జరిపాయి. పైలట్ ప్రాజెక్టు పద్ధతిలో నిర్వహిస్తున్న తరుణంలో లగ్జరీ కంపెనీల వాహనాలు కాకుండా.. సాధారణ వాహనాలను లగ్జరీగా డిజైన్ చేయనున్నారు. ఇందుకోసం రవాణాశాఖ నుంచి అనుమతులు తీసుకొచ్చేందుకు పర్యాటక శాఖ సమాయత్తమవుతోంది.



ఫారెస్ట్ కారవాన్ రానున్న అంజోడ ప్రాంతం

ఇవీ సౌకర్యాలు

కారవాన్‌లో లగ్జరీ హోమ్స్ మాదిరిగా లాంజ్ కమ్ బెడ్రూమ్, కిచెన్, రెస్ట్ రూమ్ ఉంటాయి. క్వీన్ లేదా కింగ్ సైజ్ బెడ్, మైక్రోవేవ్, ఎలక్ట్రిక్ కెటిల్, టోస్టర్, ఇండక్షన్ స్టవ్, మినీ ఫ్రిడ్జ్, షవర్‌తో కూడిన అత్యాధునిక టాయిలెట్ తదితర సౌకర్యాలన్నీ ఉంటాయని పర్యాటకశాఖ అధికారులు చెబుతున్నారు. వీటితో పాటు స్మార్ట్ టీవీ, బ్లూటూత్ మ్యూజిక్ సిస్టమ్‌తో పాటు సెక్యూరిటీ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. వివిధ సైజుల్లో కారవాన్లను అందుబాటులోకి తీసుకురావాలని ఏపీ పర్యాటక శాఖ భావిస్తోంది.

పిక్నిక్ సీజన్ నాటికి అందుబాటులోకి..



వివిధ దేశాల్లో విజయవంతంగా నడుస్తున్న కారవాన్ టూరిజం.. మన దేశంలో కేరళలో సక్సెస్ అయ్యింది. తొలి విడతగా ఉమ్మడి విశాఖ జిల్లాలో మూడు ప్రాంతాలను గుర్తించాం. ఆ ప్రాంతాల్లో అనుమతులు రాగానే ముందుకు వెళ్తాం. ఒక్కో ప్రాంతంలో అర ఎకరం విస్తీర్ణంలో కారవాన్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తాం. అక్కడ మంచినీటి సౌకర్యం, విద్యుత్ సదుపాయం, సెక్యూరిటీ, ప్రధాన రహదారికి అనుసంధానం చేసే మార్గాలు.. ఇలా పర్యాటకులకు కావాల్సిన కనీస సదుపాయాలు ఏర్పాటు చేస్తాం. ప్రకృతిని ఆస్వాదించేందుకు కారవాన్లలో టెంట్లు కూడా అందిస్తాం. ఏపీటీడీసీ ఆధ్వర్యంలో ఏర్పాటుకు కానున్న వీటికి వాహనాన్ని బట్టి ప్యాకేజీలు నిర్ణయించాలని భావిస్తున్నాం. ఈ పిక్నిక్ సీజన్ నాటికి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం.

– శ్రీనివాస్ పాణి, పర్యాటక శాఖ రీజినల్ డైరెక్టర్


ఏవీఎన్‌లో అల్లూరి మనవడి సందడి



రామరాజును సత్కరించిన ఏవీఎన్ యాజమాన్యం

దాబాగార్డెన్స్: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు సోదరుడి మనవడు అల్లూరి శ్రీరామరాజు ఏవీఎన్ కళాశాలలో సందడి చేశాడు. విద్యార్థులు, సిబ్బంది ఆయన్ని చూసి సంబరపడ్డారు. తన తాత చదువుకున్న ఏవీఎన్ స్కూల్‌ను సందర్శించడం గర్వంగా ఉందని రామరాజు చెప్పారు. ముందుగా కళాశాల ఆవరణలో గల అల్లూరి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అతడిని కళాశాల యాజమాన్యం సత్కరించింది.

జెన్‌కో ఉద్యోగుల నిరసన



మోతుగూడెం జెన్‌కో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు, కార్మికులు

మోతుగూడెం: దిగువ సీలేరు డొంకరాయి, మోతుగూడెం ఏపీ జెన్‌కో ఉద్యోగులు యూతఈయూ (సీఐటీయూ) ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. పీఆర్సీ కమిటీలో కొన్ని కార్మిక సంఘాలు యాజమాన్యంతో కుమ్మక్కవడం వల్ల కార్మికులు ముఖ్యంగా కాంట్రాక్ట్ కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని వారు ఆరోపించారు. పర్మినెంట్ కార్మికులకు 45శాతం ఫిట్‌మెంట్, మూడు వెయిట్‌లు ఇవ్వాలని మరియు అలవెన్సు, యథావిధిగా కొనసాగించాలని స్ట్రగుల్ కమిటీ డిమాండ్ చేసింది. రాష్ట్ర కమిటీ సభ్యులు చింతా రాంబాబు, రీజనల్ సెక్రటరీ జి. రత్నాకర్, కోశాధికారి బీవీ రమణ, డొంకరాయి ప్రాజెక్ట్ కార్మిక సంఘ అధ్యక్షుడు జగదీశ్వరరావు, కార్యదర్శి రమణబాబు పాల్గొన్నారు.

వై.వి.సుబ్బారెడ్డిని కలిసిన ఎంపీ మాధవి


ఉత్తరాంధ్ర రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డితో అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, శివప్రసాద్ దంపతులు

సాక్షి,పాడేరు: వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డిని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, ఆమె భర్త శివప్రసాద్‌లు గురువారం విశాఖలో కలిశారు. అరకు పార్లమెంట్ పరిధిలోని పలు అంశాలు, పెండింగ్ అభివృద్ధి పనులను సుబ్బారెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి నివేదిస్తానని చెప్పినట్టు వారు తెలిపారు.

అరకులోయటౌన్: వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డిని వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోడా సింహాద్రి బృందం మర్యాద పూర్వకంగా కలిశారు. గిరిజన ప్రాంతంలో నెలకొన్న పలు సమస్యలను వివరించినట్టు సింహాద్రి తెలిపారు. బహుజన టీచర్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు, ఆదివాసీ సంఘాల నాయకులు ఈశ్వరరావు, నరసింగరావు, దేముడు, పోతురాజు, రాజు తదితరులున్నారు.

ముగిసిన ప్రచారం


పెదకోడాపల్లిలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


సీలేరులో ప్రచారం చేస్తున్న నాయకులు

- రేపు ఉప ఎన్నిక
- పూర్తయిన ఏర్పాట్లు
- కట్టుదిట్టమైన భద్రతా చర్యలు

పెదబయలు: మన్యంలో పలు ప్రాంతాల్లో జరగనున్న ఉప ఎన్నికకు సంబంధించి ప్రచారం గురువారంతో ముగిసింది. ఈనెల 19న ఉప ఎన్నిక జరగనున్న నేపథ్యంలో అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేశారు. పోలింగ్ బూత్‌లలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు.

పెదబయలు పంచాయతీ వైఎస్సార్ సీపీ మద్దతుతో బలపర్చిన సర్పంచ్ అభ్యర్థి బట్టి చిట్టిబాబు ప్రచారం జోరుగా సాగింది. పెదబయలు పంచాయతీ పరిధిలో పెదకోడాపల్లి పంచాయతీ కేంద్రం, ఆంద్రవర, పెదగొండి. జయంతికోట, మెరకచింత, మలకరిపుట్టు, చెక్కరాయి, జయంతికోట, పరదానిపుట్టు గ్రామాల్లో నాయకులు విస్తృత ప్రచారం చేశారు. చిట్టిబాబుకు కేటాయించిన బుట్ట గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని మండల పార్టీ అధ్యక్షుడు వంతాల ఆనందరావు, జెడ్పీటీసీ కూడ బొంజుబాబు, రాష్ట్ర కార్యదర్శి జర్సింగి సూర్యనారాయణ, రాష్ట్ర ఆగ్రో డైరెక్టర్ వనల్బ సన్యాసి తదితరులు ఇంటింటికీ వెళ్లి అభ్యర్థించారు. అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ చొరవతో పెదబయలులోని పలు గ్రామాల్లో రోడ్లు ఇతర మౌలిక సదుపాయాల కల్పన పనులు జరిగాయన్నారు. పార్టీలకతీతంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, సుపరిపాలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. టీడీపీ, ఇతర పార్టీ నాయకులు కులం పేరుతో గ్రామాలకు వస్తున్నారని, వారిని నమ్మే పరిస్థితి లేదని పలువురు గ్రామస్తులు స్పష్టం చేశారు. మాజీ జెడ్పీటీసీ సూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు వంతాల అప్పారావు, కోరాబు జ్యోతి, సర్పంచ్‌లు కాతారి సురేష్‌కుమార్, కృష్ణారావు, నాయకులు కొండబాబు, కనకరాజు, భూపతినాయుడు, టింబ్రునాయులు గోపాలరావు పాల్గొన్నారు.

కొయ్యూరు: వైఎస్సార్‌సీపీ మద్దతుతో బలపరచిన వార్డు సభ్యులను గెలిపించాలని ఎంపీపీ బడుగు రమేష్ కోరారు.ఆయన గురువారం రేవళ్ల, పెదమాకవరంలో వార్డు సభ్యులుగా నిలిచిన అభ్యర్థులకు మద్దతుగా ఆయన ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు.ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారన్నారు. ఎంపీటీసీ చడ్డా మల్లేశ్వరి, మండల పార్టీ అధ్యక్షుడు జల్లి బాబులు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేగటి ముసిలినాయుడు, మాజీ సర్పంచ్ రామారావు , యూత్ కమిటీ అధ్యక్షుడు వనపరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీలేరు: సర్పంచ్ ఉప ఎన్నికల ప్రచారం చివరి రోజు గురువారం జోరుగా జరిగింది. సర్పంచ్ పదవికి పలు పార్టీల నాయకులు పోటాపోటీగా ప్రచారం చేపట్టారు. వైఎస్సార్‌సీపీ మద్దతుతో బలపర్చిన అభ్యర్థి పాంగి దుర్గో (కత్తెర గుర్తు) గెలుపునకు మండల నాయకులు సైతం సీలేరులో ప్రచారంలో పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ మండల, స్థానిక కాంగ్రెస్, టీడీపీ ఓ వర్గానికి చెందిన నాయకులు సీలేరులోని మెయిన్ బజార్, చింతపల్లి క్యాంపు, లైకన్‌పూర్, చంద్రుపల్లి గ్రామాల్లో ఇంటింటా పర్యటించి అభ్యర్థించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామల్లో జరిగిన అభివృద్ధిని చూసి ప్రతీ ఒక్కరు ఓటు వేయాలని కోరారు. ఎంపీపీ కుమారి, దావనాపల్లి సర్పంచ్ రామకృష్ణ, నాయకులు వెంకటరావు, బుజ్జి, గణేష్, స్వర్ణలత, మద్దతుదారులైన కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, అప్పారావు, సత్తిబాబు, బుజ్జి, టీడీపీ నాయకుడు కె.వల్లీ ప్రసాద్ పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమానికి పోలీసుశాఖ కృషి


కోసంపుట్టులో గిరిజన యువతకు వాలీబాల్ కిట్లు అందజేస్తున్న ఎస్‌ఐ రవీంద్ర

ముంచంగిపుట్టు: పోలీసు శాఖ గిరిజన సంక్షేమానికి కృషి చేస్తుందని ఎస్‌ఐ రవీంద్ర పేర్కొన్నారు. ఒకప్పుడు మండలంలో అత్యంత మారుమూల మావోయిస్టుల ప్రభావిత ప్రాంతాలుగా గుర్తింపు పొందిన గ్రామాలను గ్రేహౌండ్స్,స్పెషల్ పార్టీ పోలీసులతో కలిసి బుధ, గురువారాల్లో ఆయన సందర్శించారు. దీనిలో భాగంగా రంగబయలు పంచాయతీ గొబ్బరపడ, జోడిగుమ్మ, మల్లిముండా, బీజాపోదర్ గ్రామాల గిరిజనులతో వారు మమేకమయ్యారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను వారికి వివరించారు. వనుగుమ్మ నుంచి జోడిగుమ్మ వరకు నూతన రహదారి, సుత్తిగూడ, బిరిగూడ వంతెన, సెల్ టవర్ల నిర్మాణానికి జిల్లా పోలీసులు కృషి చేశారని వారికి వివరించారు. గిరిజన యువతతో మాట్లాడారు. ప్రభుత్వం,పోలీసుశాఖ కల్పిస్తున్న ఉపాధి,ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించారు. చిన్నారులకు చాక్లెట్లు పంచిపెట్టారు. యువతకు వాలీబాల్ కిట్లు అందజేశారు. వివిధ వ్యాధులతో బాధపడుతున్న గిరిజనులకు మందులు పంపిణీ చేశారు. గ్రామాల్లో సమస్యలను తెలుసుకున్నారు. వీటిని జిల్లా పోలీసు అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రవీంద్ర మాట్లాడుతూ గిరిజనులంతా సంఘ విద్రోహక శక్తులకు దూరంగా ఉండి, సంక్షేమ పథకాలను పొందుతూ అభివృద్ధి పథంలో నడవాలని, అవసరమైన సహకారం అందిస్తామని ఆయన పేర్కొన్నారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి


కళాశాలలో మరుగుదొడ్ల పనులను పరిశీలిస్తున్న డీఐఈవో అప్పలరాము

ముంచంగిపుట్టు: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి అప్పలరాము గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలో జరుగుతున్న నాడు– నేడు పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గడువులోగా పనులు పూర్తి చేయాలన్నారు. నాణ్యత, ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. మరుగుదొడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. వర్షం వల్ల వాతావరణ అనుకూలించక పనులలో ఆలస్యం జరుగుతున్నాయని సిబ్బంది డిఐఈవోకు తెలియజేశారు.అనంతరం కళాశాలలో రికార్డులు తనిఖీ చేశారు. నాడు–నేడు ద్వారా విద్యార్థులకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. అధ్యాపకులు దామోదరం, లక్ష్మణకుమార్, నూకరాజు, కోటిబాబు పాల్గొన్నారు.

పోటీ పరీక్షల నిర్వహణకు పక్కా ఏర్పాట్లు

- నేటి నుంచి నుంచి ఏపీపీఎస్సీ,
- రేపటి నుంచి యూపీఎస్సీ పరీక్షలు


పలు పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్షిస్తున్న డీఆర్వో శ్రీనివాసమూర్తి

మహారాణిపేట: ఏపీపీఎస్సీ, యూపీఎస్సీ ద్వారా నగరంలో నిర్వహిస్తున్న పలు పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని డీఆర్వో ఎస్.శ్రీనివాసమూర్తి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం పలు పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష చేశారు. ఈ నెల 18, 19, 21, 22 తేదీల్లో ఏపీపీఎస్సీ పోటీ పరీక్షలు, 19, 20 తేదీల్లో యూపీఎస్సీ పరీక్షలు జరుగుతాయన్నారు. ఏపీపీఎస్సీ నిర్వహించే అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పరీక్షకు 5,115 మంది, టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ అధికారి పరీక్షకు 530 మంది, శాంపిల్ టేకర్ పరీక్షకు 166 మంది హాజరవుతున్నట్లు చెప్పారు. ప్రతి రోజూ ఉదయం 9.30 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. ఇందుకు నగరంలో నాలుగు కేంద్రాల్లో ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 114 సెక్షన్ అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.

19, 20న కంబైన్డ్ రిక్రూట్‌మెంట్ పరీక్ష

కంబైన్డ్ రిక్రూట్‌మెంట్ పోటీ పరీక్ష ఈ నెల 19, 20వ తేదీల్లో యూపీఎస్సీ నిర్వహిస్తోందని.. ఈ పరీక్షకు జిల్లాలో 1,632 మంది హాజరవుతున్నట్లు చెప్పారు. ఈ పరీక్ష ఉదయం 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు జరుగుతుందని.. నగరంలో నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ ఎస్.వెంకటరావు, సెక్షన్ ఆఫీసర్ మల్లికార్జునరావు, ఏఎస్‌వో పద్మ ప్రియ, యూపీఎస్సీ అధికారులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

భార్యను చంపిన భర్త అరెస్ట్


నిందితుడిని అరెస్ట్ చూపిస్తున్న సీఐ సుధాకర్

పాడేరు రూరల్ : భార్యను హత్య చేసిన ఘటనలో భర్తను పాడేరు పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మండలంలోని మారుమూల ఐనాడ పంచాయతీ పెద్దపొలం గ్రామంలో ఈనెల 12న రాత్రి 9గంటలకు తన భార్య తమర్ల చిత్రోను భర్త తమర్ల బాలరాజు గొడవ పడి కర్రతో కొట్టి చంపాడు. ఈ సంఘటనపై పాడేరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహించారు. నిందితుడు తమర్ల బాలరాజును గురువారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించారని సీఐ సుధాకర్ తెలిపారు.

హెటిరో డ్రగ్స్‌లో ఉద్యోగాలకు 21న క్యాంపస్ ఇంటర్వ్యూలు

గాజువాక : ప్రముఖ ఫార్మా కంపెనీ హెటిరో డ్రగ్స్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ యూనిట్లలో ఉద్యోగాల భర్తీకి ఈనెల 21న స్థానిక టీఎస్సార్, టీబీకే డిగ్రీ కళాశాలలో ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్టు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.విష్ణువర్ధన్‌రావు తెలిపారు. ఎమ్మెస్సీ కెమిస్ట్రీ విద్యార్థులు, 2019–2023 మధ్య బీఎస్సీ కెమిస్ట్రీ పూర్తి చేసి 26 ఏళ్ల లోపు వయస్సుగల అభ్యర్థులు ఈ ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చన్నారు. ఎంపికైన అభ్యర్థులకు వార్షిక వేతనం రూ.2.70 లక్షల నుంచి రూ.2.80 లక్షల వరకు ఉంటుందన్నారు. అభ్యర్థులు తమ బయోడేటా, గుర్తింపు కార్డు, విద్యార్హతలకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని తెలిపారు.

విశాఖ–ఒడిశాకు ఏపీ ఆర్టీసీ సర్వీసులు

డాబాగార్డెన్స్: ఏపీఎస్‌ఆర్టీసీ ఈ నెల 19 నుంచి ఒడిశా రాష్ట్రానికి అంతర్‌రాష్ట్ర బస్సు సర్వీసులు ప్రారంభించనున్నట్టు విజయనగరం జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.రవికుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖపట్నం నుంచి ఒడిశాలోని వివిధ ప్రాంతాలకు బస్సులు నడుపుతున్నామని, ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

- **ఉదయం 6 గంటలు:** కూర్మన్నపాలెం నుంచి శ్రీకాకుళం, పర్లాకిమిడి మీదుగా గుణపూర్
- **ఉదయం 10 గంటలు:** విశాఖపట్నం నుంచి విజయనగరం, సాలూరు మీదుగా జైపూర్
- **ఉదయం 10 గంటలు:** విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం, పాతపట్నం మీదుగా పర్లాకిమిడి
- **మధ్యాహ్నం 1.30 గంటలు:** సింహాచలం నుంచి రాజాం, పాలకొండ, కొత్తూరు, హడ్డుబంగి మీదుగా గుణపూర్
- **మధ్యాహ్నం 3.30 గంటలు:** విశాఖపట్నం నుంచి ఎస్.కోట, అరకు మీదుగా ఒనకఢిల్లీ
- **సాయంత్రం 4 గంటలు:** విశాఖపట్నం నుంచి విజయనగరం, పార్వతీపురం, గుమ్మలక్ష్మీపురం మీదుగా గుణపూర్
- **సాయంత్రం 5 గంటలు:** విశాఖపట్నం నుంచి విజయనగరం, సాలూరు మీదుగా నవరంగపూర్

జెడ్పీ సర్వ సభ్య సమావేశం 22కు వాయిదా

మహారాణిపేట (విశాఖ): ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 22వ తేదీకి వాయిదా పడింది. ముందు అనుకున్న ప్రకారం ఈనెల 19న సమావేశం నిర్వహించాల్సి ఉందని, ఖాళీగా ఉన్న పంచాయతీ స్థానాలకు ఎన్నికల దృష్ట్యా ఈ నెల 22వ తేదీకి వాయిదా వేసినట్లు జెడ్పీ సీఈవో పి.శ్రీరామ్మూర్తి తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు.

అదృశ్యమైన మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

కె.కోటపాడు: ఐదు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన మతిస్థిమితం లేని వ్యక్తి విగతజీవిగా మారాడు. చౌడువాడ శివారు జీడితోటలో మేడిశెట్టి శ్రీను(38) మృతదేహం లభ్యమైంది. పోలీసుల వివరాల మేరకు... దేవరాపల్లి మండలం ములకలాపల్లికి చెందిన మేడిశెట్టి శ్రీనుకు కె.కోటపాడు మండలం చౌడువాడకు చెందిన రోహిణితో వివాహమైంది. కొన్ని రోజులుగా చౌడువాడలోనే వీరు నివాసం ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఐదేళ్లుగా శ్రీనుకు మతిస్థిమితం సరిగా లేదు. ఈ నెల 12న గ్రామంలో భార్య పని చేస్తున్న పందుల ఫారం వద్దకు వెళ్లి తనను ఎవరో కొట్టేందుకు వస్తున్నారని చెప్పి పారిపోయాడు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు పరిసర గ్రామాల్లో వెతికారు. ఈ క్రమంలో చౌడువాడ శివారు జీడితోటలో తీవ్ర దుర్వాసన రావడంతో రైతులు అనుమానంతో వచ్చి చూడగా మృతదేహం కనిపించింది. ఈ విషయం తెలుసుకున్న భార్య రోహిణి అక్కడకు వెళ్లి మృతదేహం శ్రీనుదిగా గుర్తించింది. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు పోలీసులు అప్పగించారు.

వివాహిత అనుమానాస్పద మృతి

- వస్త్రంతో మెడ నులిమి చంపినట్లు ఆనవాళ్లు
- చౌడవాడలో ఘటన


మృతిచెందిన ఇంట్లో వివరాలను సేకరిస్తున్న ఎస్‌ఐ ధనుంజయ్

కె.కోటపాడు: మండలంలోని చౌడువాడ గ్రామానికి చెందిన దొడ్డి వాణి(30) ఇంట్లో మేడపై గురువారం తెల్లవారుజామున అనుమానాస్పదంగా మృతిచెందింది. ఆమె భర్త నూకరాజు ప్రైవేటు కంపెనీలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం అతడు విధులకు వెళ్లడంతో రాత్రి ఇంట్లో కుమార్తె వాణికి తోడుగా నిద్రించేందుకు తల్లి వరలక్ష్మి వచ్చింది.

ఈ క్రమంలో తెల్లవారు జామున మేడపై గదిలో పడుకున్న కుమార్తెను లేపేందుకు తల్లి వెళ్లి చూడగా, చలనం లేకుండా పడి ఉంది. దీంతో ఒక్కసారిగా షాక్‌కు గురై కింద ఇంట్లో ఉంటున్న వాణి అత్త, మామలకు సమాచారాన్ని అందించింది. దీంతో వారు వచ్చి చూడగా వాణి మృతి చెంది ఉండడాన్ని గమనించారు. ఆమె మెడపై వస్త్రంతో నులిమి చంపినట్లుగా ఆనవాళ్లను గుర్తించారు. కుమార్తె మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ తల్లి వరలక్ష్మి కె.కోటపాడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. సంఘటనా స్థలాన్ని సీఐ తాతారావు, ఎస్‌ఐ ఆర్.ధనుంజయ్ పరిశీలించారు. మృతదేహానికి పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించారు.

ఉలిక్కి పడ్డ చౌడువాడ..

గురువారం తెల్లవారుజామున దొడ్డి వాణి హత్యకు గురైందన్న వార్త గ్రామంలో సంచలనం కలిగించింది. గవరపేటకు వెళ్లే మార్గంలో ఉంటున్న ప్రజల్లో తీవ్ర భయాందోళన వ్యక్తమైంది. ఆమె మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. భార్య మృతితో భర్త నూకరాజు, కుమారులు బోరున విలపించడంతో వారిని ఓదార్చడం ఎవ్వరితరమూ కాలేదు.

చేతులెత్తేసిన వైజాగ్ వారియర్స్

- తొలి మ్యాచ్‌లో గోదావరి టైటాన్స్, రెండో మ్యాచ్‌లో రాయలసీమ కింగ్ విజయం


షాట్ కొడుతున్న గోదావరి టైటాన్స్ బ్యాట్స్‌మన్

విశాఖ స్పోర్ట్స్: ఏపీఎల్ సీజన్–2 రెండో మ్యాచ్‌లో గోదావరి టైటాన్స్ 56 పరుగుల తేడాతో వైజాగ్ వారియర్స్‌పై విజయం సాధించింది. టైటాన్ కెప్టెన్ జ్ఞానేశ్వర్ అద్భుత ఇన్నింగ్స్ ఆడి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ–వీడీసీఏ స్టేడియంలో గురువారం జరిగిన తొలి మ్యాచ్‌లో టాస్ గెలిచిన వారియర్ కెప్టెన్ అశ్విన్ హెబ్బర్ ఫీల్డింగ్ ఎంచుకోవడంతో టైటాన్స్ బ్యాటింగ్‌కు దిగింది. 20 ఓవర్లు బ్యాటింగ్ చేసి ఆరు వికెట్లు కోల్పోయి 191 పరుగుల భారీ స్కోర్ నమోదు చేసింది. ఓపెనర్‌గా జ్ఞానేశ్వర్ కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడి 53 బంతుల్లో 80 పరుగులు(3X4, 6X6) చేసి కార్తీక్ బౌలింగ్‌లో కరణ్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. సందీప్ 38 బంతుల్లో 63 పరుగుల(5X4, 3X6)వద్ద రనౌట్ అయ్యాడు. హేమంత్ 20, శశికాంత్17 పరుగులు చేశారు. పవర్ ప్లే ఓవర్‌లో ఒక వికెట్ కోల్పోయి ఒక పరుగే చేసిన టైటాన్స్ మూడో వికెట్‌కు ఏకంగా జ్ఞానేశ్వర్–సందీప్ 100 పరుగులు జోడించారు. కార్తీక్ రామన్ రెండు వికెట్లు తీయగా ఆంజనేయులు, రాజు చెరో వికెట్ పడకొట్టారు. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన వైజాగ్ వారియర్స్ 50 పరుగుల మార్క్‌ను మూడు వికెట్లు కోల్పోయి 32వ బంతికే నమోదు చేసింది. అయితే క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోవడంతో వారియర్స్ 17.4 ఓవర్లలోనే ఆలౌటైంది. ఓపెనర్‌గా కెప్టెన్ అశ్విన్ హెబ్బర్ అత్యధికంగా 36 పరుగులు చేయగా.. కె.ఎస్.ఎన్ రాజు (35), కరణ్ షిండే(33) నాలుగో వికెట్‌కు 55 పరుగులు జోడించారు. 115 పరుగుల వద్ద నాలుగో వికెట్ కోల్పోగా మరో 20 పరుగులకే చివర్లో ఆరు వికెట్లు కోల్పోయి వారియర్స్ చేతులెత్తేశారు. ఇస్మాయిల్ మూడు వికెట్లు, విజయ్, శశికాంత్ రెండేసి వికెట్లు తీశారు. మాధవ్ ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే 17 పరుగులు సమర్పించుకున్నా.. మూడో బంతికే ఓపెనర్ వికెట్ తీశాడు. చివర్లో సత్యనారాయణరాజు వికెట్ తీయడంతో వారియర్స్ ఆట ముగిసింది.

కుమ్మేసిన రాయలసీమ కింగ్స్

మరో మ్యాచ్‌లో ఉత్తరాంధ్ర లయన్స్‌పై రాయలసీమ కింగ్స్ ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. కింగ్స్ కెప్టెన్ హనుమ విహారి టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకోవడంతో ఉత్తరాంధ్ర లయన్స్ తొలుత బ్యాటింగ్‌కు దిగింది. ఓపెనర్లు గుల్బాం 1, కెప్టెన్ భరత్ 15 పరుగులు చేసి వెనుదిరిగారు. వన్‌డౌన్‌లో వచ్చిన రోహిత్(25) ఇన్నింగ్స్ చక్కదిద్దే పనిలో పడ్డాడు. మరో ఎండ్‌లో రాహుల్ 31 బంతుల్లోనే 60 పరుగులు(4X4, 5X6) చేశాడు. నాలుగో వికెట్‌కు శ్యామ్(22)తో కలిసి 53 పరుగుల భాగస్వామ్యాన్ని అందించాడు. వాసు 20 పరుగులు చేయగా తేజస్వి 13 పరుగులతో నిలవడంతో లయన్స్ జట్టు 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 181 పరుగులు చేసింది. హరి శంకర్ నాలుగు ఓవర్లలో 24 పరుగులిచ్చి ముగ్గురిని ఔట్ చేశాడు. వినయ్ 2 వికెట్లు, సాకేత్, హనుమ, కమరుద్దీన్ చెరో వికెట్ పడగొట్టారు. భారీ లక్ష్యంతోనే బరిలోకి దిగిన రాయలసీమ కింగ్స్ ఓపెనర్లు అభిషేక్(16), వీరారెడ్డి(1) వికెట్లను 17 పరుగులకే కోల్పోయింది. హనుమ విహారి(13) మూడో వికెట్‌కు వంశీకృష్ణ(53)తో కలిసి 50 పరుగుల భాగస్వామ్యాన్ని అందించి 69 పరుగుల వద్ద వెనుదిరిగాడు. 13 బంతుల్లోనే వినయ్ 21 పరుగులు చేసి 107 స్కోర్ వద్ద ఔటయ్యాడు. గిరినాథ్ 19 బంతుల్లో 32(3X4, 2X6), కమరుద్దీన్ 18 బంతుల్లో 39(5X4, 2X6) పరుగులతో నిలిచి మరో మూడు బంతులుండగానే జట్టును విజయతీరానికి చేర్చారు. ఇన్నింగ్స్ చివరి ఓవర్ వేసిన అజయ్ తొలి బంతిని కమరుద్దీన్ బౌండరీకి తరలించగా తర్వాత రెండు బంతులను సిక్సర్లుగా మలిచి విజయకేతనం ఎగురవేశాడు. అజయ్, అయ్యప్ప, పృథ్వీ, తపస్వి, తేజస్వి చెరో వికెట్ తీశారు.

హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి సేవలు ప్రశంసనీయం


హోమీబాబా ఆస్పత్రిలో సేవలు ప్రారంభిస్తున్న డైరెక్టర్ బద్వే, సీఎండీ భట్

ఉక్కునగరం : క్యాన్సర్ రోగులకు హోమీబాబా క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ అన్నారు. ఆస్పత్రిలో విస్తరించిన ప్రైవేట్ డే కేర్ సేవలు, ప్రైవేట్ వార్డులు, ఐసోటోప్ థెరపీ వార్డులు, సెయింట్ జూడ్స్ పీడియాట్రిక్ సపోర్ట్ యూనిట్, కెఫెటేరియా బ్లాక్‌లను ముంబయి టాటా మెమోరియల్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.ఎ.బద్వేతో సంయుక్తంగా ఆయన గురువారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రోగుల కోసం కొత్త సౌకర్యాలు కల్పించడం వారి నిబద్ధతను తెలియజేస్తుందన్నారు. డైరెక్టర్ బద్వే మాట్లాడుతూ క్యాన్సర్ రోగులకు ఏకరీతి మార్గదర్శక ఆధారిత సమగ్ర సేవలు అందించడానికి, దేశవ్యాప్తంగా కేంద్రాలను అభివృద్ధి చేయడానికి టాటా మెమోరియల్ సెంటర్ విజన్‌తో పనిచేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో విశాఖ హోమీబాబా ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ ఉమేష్ మహంతశెట్టి తదితరులు పాల్గొన్నారు.